సాంప్రదాయకంగా వస్తున్న బ్రాస్ ఆయిల్ లాంప్ ముందు లావాదేవీలు జరుగుతాయి. ఇంపార్టెంట్ ఫ్యామిలీ డెసిషన్స్, ముఖ్యమైన సంఘటనలు, అగ్రిమెంట్స్ పెళ్ళినిశ్చితార్థాలు కూడా ఆ లాంప్‌ముందే జరుగుతాయి.

ఇక్కడున్న ప్రతి ఇంటిలో అలాంటి దీపం ఒకటుంటుంది. దాన్ని ఉదయం, సాయంత్రం వెలిగిస్తుంటారు.

అప్పు ఎగ్గొట్టడం మహాపాపం క్రింద పరిగణిస్తారు. ఆ పైన వదిలేస్తారు.

దీపం ముందు యిచ్చినమాటను తప్పటం మహానేరంగా పరిగణిస్తారు.

ఇక్కడ ప్రతి ఒక్కరూ నాన్‌వెజిటేరియన్స్. మనం ఒక రోజంతా తినే ఆహారాన్ని వీళ్ళు ఒక్కసారి చాలా తేలిగ్గా తినేస్తారు.

ఇక్కడి ప్రజలకు ఆత్మాభిమానం ఎక్కువ. మనకు ఎంతో కొంత ఇవ్వవలసి వుండి అవతలి వ్యక్తి అదిచ్చినప్పుడు దాన్ని మనం నమ్మి వెంటనే జేబులో పెట్టుకోవాలి. వారిముందే లెక్కేస్తే దాన్ని వాళ్ళు తీరని అవమానంగా భావిస్తారు.

ఎంత కష్టపడతారో అంతగా తింటారు, తాగుతారు. జీవితాన్ని అనుభవిస్తారు. నీతినిజాయితీలంటే ప్రాణమిస్తారు. ఆత్మాభిమానం, అభిజాత్యంకోసం చచ్చిపోతారు.

వీళ్ళకి వేరే రకం వినోదంలేదు. కావాలనుకున్నప్పుడు అటు బెంగుళూరో ఇటు మంగుళూరో వెళ్ళి ఒక వారం గడిపి వస్తారు"

లెక్చరర్ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, సాంప్రదాయాల్ని, మానవ విలువల్ని కలిపి చక్కగా వివరిస్తుంటే నలుగురు తప్ప అందరూ శ్రద్ధగా వింటున్నారు.

ఇద్దరు అక్కడుండి మరో ఇద్దరు అక్కడలేక- అక్కడుండీ కూడా లేనట్లుగా ప్రవర్తిస్తున్నవారు మధుకర్, మహతి.

లేనివాళ్ళు మేరీ విజయ్. 'ఇక్కడ హీనాతిహీనంగా, హేయంగా ఎవర్ని చూస్తారో తెలుసా?' ఉన్నట్లుండి, అసంకల్పితంగా, పెద్దగా అంది మహతి తదేకంగా ఫైర్ ప్లేస్‌కేసే చూస్తూ.

అప్పటివరకు మౌనిలా ఉన్న మహతి ఒక్కసారి అలా మాట్లాడేసరికి అందరూ ఆమెవైపు విస్మయంగా చూశారు.

"చెప్పండి అప్పుడే మర్చిపోయారా?" తిరిగి అంది బిట్టర్‌గా.

"సోమరిపోతుల్ని" ఎవరూ అనకపోయేసరికి లెక్చరరే తిరిగి అన్నారు.

మహతి చటుక్కున మధుకర్‌వైపు చూసింది.

అతని ముఖం వివర్ణమయింది.

"Better to die on your feet than live on your knee ...." అనే సత్యాన్ని ఇక్కడ బాగా విశ్వసిస్తారు కదా మాస్టారు...?ఎక్కడయినా దాన్నే కదా విశ్వసించాలి?" డ్రీమీగా అంది మహతి.

ఆమె సడన్‌గా అలా ఎందుకందో?

ఆ మాటలు ఎందుకు మాట్లాడుతుందో.... అర్థం కాలేదు వారికి.

కాని మధుకర్‌కి అర్థమయింది.

కొన్ని రోజుల క్రితం మహతి తన డైరీలో రాసుకున్న వాక్యాలు కూడా అతనికి గుర్తుకొచ్చాయి.

ప్రేమ నీ స్థాయికి దిగిరాదు.....

నీవే ప్రేమస్థాయికి ఎదగాలి.....

గాఢంగా ప్రేమించుకొనే యువతీ యువకులు ప్రపంచానికి నటిస్తున్నట్లుగా కనబడుతుంది.

ప్రేమను నటించేవాళ్ళు నిజమైన ప్రేమికులుగా కనిపిస్తారు. అదే ప్రేమలోని విచిత్రం!

తనదైన ప్రపంచం చిన్న దైనా, తనకోసం, తను కోరుకున్న వారి కోసం బ్రతకాలనిపిస్తుంది.

ప్రేమని, ఆరాధనని, అనుబంధాన్ని, ఆవేదనని, అవసరాన్ని, బాధల్ని, భయాల్ని నిర్భయంగా వెలిబుచ్చటం జరుగుతుంది.

తనకు కావాల్సిందేమిటో తనను ప్రేమించేవారికి అవసరమైందేమిటో అవగతమవుతుంటుంది.

అప్పుడే మొదలవుతుంది జిజ్ఞాస....

తనకు తెలిసిన ప్రపంచం చిన్నదని....

తను తెల్సిన వ్యక్తులు తక్కువని.....

ఆ జిజ్ఞాస ఏ అంచుకు తీసుకువస్తుందో తెలుసుకోకుండానే తన చిన్ని ప్రపంచపు హద్దుల్ని చెరిపేసుకుంటూ, అతి పెద్ద ప్రపంచంలోకి అడుగు పెడుతుండగానే వింత వ్యక్తులు, విచిత్రమైన అనుభవాలు ఎదురవుతాయి.

నిజానికి తనకవసరం లేని ప్రపంచం గురించి తెల్సుకోవాల్సిన అవసరం లేదు.

కాని... అర్థంలేని జిజ్ఞాసతో అంతరంగంలో దాగి వుండే అతిమెత్తని...... సుతిమెత్తని ప్రేమైక సామ్రాజ్యపు పొరకి నిర్థాక్షిణ్యంగా నిప్పు పెట్టేసుకుంటారు.

ఆ పైన వారి మాటల్లో, చూపుల్లో, కదలికల్లో మొరటుదనం కనిపిస్తుంది. మెత్తదనం ఇగిరిపోతుంది. నాజూకుతనం అంతరించిపోతుంది. స్పందించే మనసు చైతన్యాన్ని కోల్పోతుంది.

అప్పటినుంచే ఆత్మవంచన ఆరంభమవుతుది. అర్థ రహితమైన గంభీరత వ్యక్తిత్వాన్ని కప్పేస్తుంది. తన మానసిక అవసరాలకు కపటపరిపూర్ణత ముసుగుని, శారీరక అవసరాలకు ఆత్మవంచన కవచాన్ని తొడిగేసుకొని జీవితాన్ని అపురూపమైన జీవితాన్ని అనంత విశ్వంలో తోసివేసి ఎడారిగా మిగిలిపోతారు.

అందుకే మనిషి ఎప్పుడూ రెండుగా విడిపోవాలి. బరువు బాధ్యతల్ని మోసేందుకు, బ్రతుకుదెరువును సులభతరం చేసుకొనేందుకు తనది కాని, తనకు ఎదుట నిలిచే ప్రపంచానికి డిప్లొమేట్‌గా కనిపించాలి, వ్యవహరించాలి.

అనుభూతించగలిగే తనలోని, తన ప్రపంచానికి మాత్రం, పసిగానే, మొగ్గగానే, బోసినవ్వుతోనే స్వాగతం పలకాలి.

తను బ్రతికే ప్రపంచం........

తనను బ్రతికించే ప్రపంచం.....

రెండూ విడిపోయే మనగలగాలి.

బుష్ ప్రపంచానికి అమెరికా ప్రెసిడెంట్...... తన భార్యకు....... ప్రెసిడెంట్ కాదు.... ప్రేమించి, ఆరాధించే అతి సుందర స్వభావుడు... ప్రేమికుడు.

వాటిమధ్య సరిహద్దుని చెరిపేస్తే?!

ప్రేమించటానికి అర్హత  అక్కర్లేదేమో...... కాని ప్రేమింపబడటానికి అర్హత కావాలి.

ఎందరో ఆడపిల్లలకి డబ్బున్న అత్తా, మామలు చాలేమో...

కాని నాకు మాత్రం డబ్బు సంపాదించగలిగే మొగడు కావాలి. డబ్బున్న అత్తామామలు కాదు. నాకు నువ్వు కట్టే తాళి నీ కష్టార్జితంతో కొన్నదై ఉండాలి.

నే పెట్టుకోవాల్సిన మల్లెపూలు......

కట్టుకోవలసిన శోభనం చీర.....

నోరు తీపి చేసుకోవలసిన స్వీట్స్....

మన అనురాగాన్ని, అనుబంధాన్ని పంచుకోవటానికి తాగే పాలు.... అన్నీ నీకై నీవు నీ కష్టార్జితంతో తెచ్చినవే కావాలి.

ఆత్మాభిమానం, ఆత్మగౌరవం, వ్యక్తిత్వంతో సమ్మిళితం కాని ప్రేమకి పునాదులుంటాయంటే నేను నమ్మను.

కేవలం వయస్సు, వ్యామోహం, కాంక్ష, ఆకర్షణ ప్రాతిపదికగా ఏర్పడే ప్రేమ, పుట్టే ప్రేమపై నాకు గౌరవం లేదు.

ఎవరి కష్టార్జితమైతే నేమిటి?

అనుభవిస్తే పోలే..... అనే వాళ్ళంటే నాకు అసహ్యం. అలాంటి స్త్రీజాతి మీద నాకు మరింత అసహ్యం.

నామీద నీకున్న ప్రేమ వివేకవంతమైనదే, నిజమైనదే అయితే, నీకోసం నీ తండ్రి కూడబెట్టిన అపారసంపదను వదలి రోడ్డుమీదకు రా.

మరో విషయం........, అది త్యాగమనుకొనేవు.. కాదు ప్రేమకి నీవిచ్చే గౌరవం.

విచిత్రమైన అభిప్రాయాలు...... వింత వ్యక్తిత్వం.

తల విదిలించి లేచాడు మధుకర్.

ప్రాణంలో ప్రాణంగా కలిసిపోయిన మహతికి అంత లోతయిన మనస్సుందని, భావాలున్నాయని తెలీని మధుకర్ షాక్ తిన్నాడు. నా మనస్సుకి అద్దం నా డైరీ చదువు అని తను కాఫీ తెచ్చేందుకు వంటింట్లోకి వెళ్ళినప్పుడు తను చదివిన వాక్యాలు అవి- తను చదివిన ఆమె మనస్సది.

తన వెనుక గుట్టలు గుట్టలుగా పడివున్న సంపదను ప్రశ్నించే వాక్యాలవి. తనను మూగివున్న సుఖాల్ని, సౌఖ్యాల్ని, సమస్త వస్తుసంపదను దూదిపింజల్ని చేసే సుడిగాలిని మోసుకొొచ్చిన  వాక్యాలివి. అవన్నీ గుర్తుకొచ్చిన మధుకర్ గిరుక్కున వెనుతిరిగాడు. అంతే అ మరుక్షణమే ఆ గెస్ట్‌హౌస్‌ని ఎవరికీ తెలీకుండా ఖాళీచేసి మర్కెరా  టూ బెంగుళూరు బస్ ఎక్కాడు.

తన మాటలు మధుకర్‌లో ఎంత తుఫాను రేపి ఉంటాయో మహతి సరీగ్గానే ఊహించగలిగింది.

కానది ఎంతటి విపరీత ఘటనలకు దారితీస్తుందో ఆమె ఊహించలేదు. మధుకర్ లేడని వాళ్ళు గ్రహించేసరికే అతను శొంఠికొప్ప టౌన్ దాటేశాడు.

*  *  *  *

ఆ రాత్రంతా మహతి నిద్రపోకుండానే ఆలోచిస్తూ గడిపింది.

ఉదయాన్నే ---

"ఏమయింది మహతీ......? నువ్వెందుకలా  అసందర్భంగా మాట్లాడావు? మధుకర్ రాత్రికి రాత్రే బెంగుళూరు ఎందుకు వెళ్ళిపోయాడు. ఆ రెంటికి సంబంధం వుందా?" మేరీ బెడ్ కాఫీ తీసుకుంటూ అడిగింది.

మహతి ఆ మాటల్ని వింది.... అయినా మౌనంగా కిటికీలోంచి పల్చబడుతున్న మంచుపొగనే చూస్తోంది. "ఈ ఆలోచనలు, మనస్తాపాలు, లోలోన కుళ్ళిపోవటాలు, ఫ్రస్ట్రేషన్, డిప్రెషన్, ఉద్వేగం, ఉద్రేకం...... ఏమిటివన్నీ.... ? వాటి మూలంగా జీవితంలో ఎంత విలువైన వాటిని  పోగొట్టుకుంటున్నామో తెలుసా? కాలచక్రం మన అందాలకు, కోర్కెలకు, అనుభూతులకు, అనుభవాలకు వయస్సుని జోడించి

వృద్ధాప్యానికి చేరువ చేస్తుంది. వెనక్కి తిరిగి చూసుకుంటే..... ఏమీ వుండదు. నా మాట విను -- ఒక్కసారి మనస్సుకు ప్రాముఖ్యత ఇస్తే, అది మనల్ని పిచ్చివాళ్ళుగా మార్చివేస్తుంది.

నువ్వూ, మధుకర్ ప్రేమించుకున్నారు.

బాగా గాఢంగా ప్రేమించుకున్నారు. శాశ్వతంకాని చిన్న చిన్న భేధాభిప్రాయాలకు, వైరుధ్యాలకు ఆ ప్రేమని-- ఆ ప్రేమ ద్వారా లభించే అమర సుఖాల్ని ఎందుకు బలిపెట్టుకుంటారు.....?" మేరీ అంది. క్రితం రాత్రి తాను విజయ్‌తో పంచుకున్న మధురానుభూతుల్ని నెమరువేసుకుంటూ.

"అవును--మేరీ చెప్పింది అక్షరాలా నిజం-- చేతి వేళ్ళ మధ్యనుంచి విలువైన కాలం ఇసుకలా జారిపోతున్నా, చూస్తూ కూర్చోవటం మూలంగా ఫలితం ఏమిటి!" అంది సుధారాణి కాఫీ తీసుకోవటం పూర్తయ్యాక సిగరెట్ వెలిగించుకుంటూ.

మహతి విసురుగా తలతిప్పి పొగని రింగులుగా వదులుతున్న సుధారాణి కేసి ఒకింత అసహనంగా, అయిష్టంగా చూసింది.

"కొందరికి జీవిత లక్ష్యం కేవలం సుఖించటమే. అనుభవించటమే కావచ్చు. మరి కొందరికి ఎలా సంపాదించినా, ఎక్కువ సంపాదించామా లేదా అన్నదే లక్ష్యం కావచ్చు. మరికొందరికి తన గురించి తనే ఎంతో ఎక్కువగా చెప్పుకొని ఆత్మవంచన చేసుకోవటమే లక్ష్యం కావచ్చు.

అంత మాత్రాన, అని సిగ్గు దేల్చిన నిజజీవితపు సత్యాలు, లక్ష్యాలుకావు.